సాక్షి
కర్నూలు
బుధవారం । 4 । జూన్ । 2025



**వజ్రం లభ్యం**

తుగ్గలి: జొన్నగిరి గ్రామంలో పొలంలో ఓ రైతుకు మంగళవారం వజ్రం లభ్యమైనట్లు సమాచారం. ఈ వజ్రాన్ని ఓ వజ్రాల వ్యాపారి టెండర్ ద్వారా రూ.41 వేలకు కొనుగోలు చేసినట్లు తెలిసింది.



**వక్ఫ్ చట్టసవరణ ఉప సంహరించాలి**

వక్ఫ్ చట్ట సవరణ ఉప సంహరించక పోతే ఉద్యమం చేస్తామని ముస్లిం పర్సనల్ లాబోర్డు రాష్ట్ర కమిటీ సభ్యులు జలీసా సుల్తానాయాసీన్ కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. 8లో▸



**టీబీ డ్యాం సమాచారం**

| | |
|---|---|
| పూర్తి మట్టం | :1,633 అడుగులు |
| ప్రస్తుతం | :1,599.14 |
| టీఎంసీల సామర్థ్యం | :105.788 |
| ప్రస్తుతం | :20.292 |
| ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు) | :10,989 |
| ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు) | :245 |

## న్యూస్‌రీల్

### రేషన్ సరుకుల పంపిణీలో ఫిర్యాదులకు తావివ్వొద్దు

● కలెక్టర్ రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): రేషన్ సరుకుల పంపిణీలో ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదేశించారు. మంగళవారం రేషన్ పంపిణీపై కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా ఆర్‌డీఓలు, తహసీల్దార్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 65 సంవత్సరాలు నిండిన వృద్ధులు, వికలాంగులు, మంచానికే పరిమితమైన వారికి ఇంటి వద్దకే వచ్చి డీలర్లు సరుకులను ఇస్తారని, వారు షాపుల దగ్గరకు వెళ్లాల్సిన పని లేదన్నారు. తప్పనిసరిగా ఉదయం 8 గంటలకు షాపులు తెరిచేలా చూడాలని తహసీల్దార్లకు సూచించారు. రేషన్‌షాపుల పర్యవేక్షణకు సచివాలయానికి ఒక నోడల్ అధికారిని నియమించాలన్నారు. జేసీ డాక్టర్ బి.నవ్య మాట్లాడుతూ 5వ తేదీలోపే వృద్ధులు, వికలాంగులు, అనారోగ్యంతో బాధపడే వారికి సరుకుల పంపిణీని పూర్తి చేసేందుకు తహసీల్దార్లు, పౌరసరఫరాల డీటీలు చర్యలు తీసుకోవాలన్నారు. రేషన్ సరుకుల పంపిణీలో రాష్ట్రంలోనే కర్నూలు జిల్లా ప్రథమ స్థానంలో ఉందని, జూన్ 2 నాటికి 2,42,975 మంది కార్డుదారులకు సరుకుల పంపిణీ పూర్తయిందన్నారు.

### ఆర్‌యూ ఒరిజినల్ డిగ్రీ సర్టిఫికెట్ దరఖాస్తులో మార్పు

● దరఖాస్తు చేసుకుంటే ఇంటికే సర్టిఫికెట్

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో ఒరిజినల్ డిగ్రీ సర్టిఫికెట్‌కు దరఖాస్తుకు కొన్ని మార్పులు చేసినట్లు వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. వర్సిటీ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ వి.వెంకట బసవరావు ఆదేశాల మేరకు ఈనెల 5వ తేదీ నుంచి దరఖాస్తు విధానంలో మార్పు అమలులోకి వస్తుందన్నారు. ఓడీకి దరఖాస్తు చేసుకునే విద్యార్థులు తగిన రుసుం చెల్లించి అవసరమైన ధ్రువపత్రాలపై గెజిటెడ్ ఆఫీసర్‌తో సంతకం చేయించాలన్నారు. దరఖాస్తుతో పాటు విద్యార్థి ప్రస్తుత చిరునామా(చిరునామా స్టాంప్, ఏ4 సైజ్ ఎన్వలప్) కవర్‌ను జత చేసి అందించాలన్నారు. సంబంధిత చిరునామాకు 10 నుంచి 15 రోజుల్లోగా ఓడీని పంపుతామన్నారు. 5వ తేదీ నుంచి అందించే దరఖాస్తులకు పోస్టు ద్వారా మాత్రమే ఒరిజినల్ డిగ్రీ సర్టిఫికెట్ పంపుతామని పేర్కొన్నారు.

### 13న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

కర్నూలు(అర్బన్): జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలను జెడ్పీలోని మినీ సమావేశ భవనంలో ఈ నెల 13న ఉదయం 10 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ఉత్తర్వుల మేరకు ఈ సమావేశాలను ఏర్పాటు చేశామన్నారు. గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, సాంఘిక సంక్షేమం, విద్య, వైద్యం, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమం, ఆర్థిక ప్రణాళిక అంశాలపై చర్చ కొనసాగుతుందన్నారు. సమావేశాలకు ఆయా స్థాయీ సంఘాల సభ్యులు, వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు తమకు కేటాయించిన సమయానికి తప్పక హాజరు కావాలని సీఈఓ కోరారు.



ప్రశ్నించారు.. వదిలేశారు!

ప్రీతిబాయి తల్లి నుంచి వివరాలు తెలుసుకుంటున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ (ఫైల్)

### ‘జత్వానీ’పై పెట్టిన శ్రద్ధ సుగాలి ప్రీతి కేసుపై ఏదీ!?

బాలీవుడ్ నటి జత్వానీ కేసుపై పెట్టిన శ్రద్ధ సుగాలి ప్రీతి కేసుపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించలేకపోయింది. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు 2017లో ఈ ఘటన జరిగినా, ఎన్నికల్లో రాజకీయ అస్త్రంగా జనసేన, టీడీపీ ఈ అంశాన్ని వాడుకున్నాయి. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, హోంమంత్రి అనితను ప్రీతి తల్లి పార్వతి కలిసినా ప్రయోజనంలేకపోయింది. ఈ విషయమై పార్వతి స్వయంగా మీడియా ద్వారా ప్రభుత్వంపై విమర్శలు చేశారు.



### అదుపు తప్పిన శాంతిభద్రతలు

- జిల్లా ఎస్పీల చేతుల్లో ఏ అధికారం లేదు అన్న భావన సీఐ, ఎస్‌ఐలలో బలంగా పాతుకుపోయింది.
- ఇటీవల ఏసీబీకి చిక్కిన నాలుగో పట్టణ సీఐ మధుసూదన్‌గౌడ్ టీడీపీ ఏజెంట్‌లా వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయి.
- వైఎస్సార్‌సీపీ నేతలతో పాటు ఏకంగా మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఏదైనా సమస్య కోసం ఫోన్ చేసినా, స్టేషన్‌కు వెళ్లినా బాహాటంగానే ‘మీది ఏది జరగదు. మీకు తెల్సు! ఎందుకు స్టేషన్‌కు వస్తారు!’ అని బాహాటంగానే మాట్లాడారంటే ‘లా అండ్ ఆర్డర్’ ఎంత దారుణంగా ఉందో ఇట్టే తెలుస్తోంది.
- ఆళ్లగడ్డ పరిధిలోని చెన్నంశెట్టిపల్లెలో రవీంద్ర అనే వ్యక్తి ట్రాక్టర్ తెచ్చుకుని బాడుగకు ఇసుక తోలుతుంటే హరిప్రసాద్ అనే ఎస్‌ఐ డబ్బులు డిమాండ్ చేశారు. తన భార్య ఆస్పత్రిలో చికిత్స పొందుతోందని తెలిపినా ట్రాక్టర్ ఆపి వేధించడంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నం చేశారు.
- పత్తికొండ సీఐ జయన్న అక్రమ కేసులు బనాయిస్తున్నారని, వేధింపులు తాళలేక ప్రవీణ్ అనే వ్యక్తి సెల్ఫీ వీడియో తీసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు.

**రూ.1718.08 కోట్లు** (ఏడాదికి 3 ఉచిత గ్యాస్‌సిలెండర్లు అమలు చేయకపోవడం వల్లే కలిగే నష్టం)

**రూ.1678.85 కోట్లు** (‘యువనేస్తం’ ద్వారా భృతి ఇవ్వక పోవడంతో నిరుద్యోగులకు కలిగే నష్టం)

**రూ.1635.50 కోట్లు** (ఆడబిడ్డ నిధి అమలు చేయకపోవడంతో మహిళలకు వాటిల్లే నష్టం)

**రూ.593.47 కోట్లు** (అన్నదాత సుఖీభవ అమలు చేయక పోవడం వల్ల రైతులకు కలిగే నష్టం)

**రూ.727.93 కోట్లు** (తల్లికి వందనం అమలు చేయక పోవడం వల్ల విద్యార్థులకు కలిగే నష్టం)

**రూ.255.50 కోట్లు** (ఉచిత బస్సు అమలు చేయకపోవడం వల్ల మహిళలకు నష్టం)

**రూ.6,609.28 కోట్లు** (సూపర్‌సిక్స్‌కు మంగళం పాడటంతో ఏడాదికి జిల్లాకు కలిగే నష్టం)

# పాలన పచ్చపాతం
# వెన్నుపోటు సమస్తం

**నేటితో సార్వత్రిక ఎన్నికల ఫలితాలకు ఏడాది**

- ‘సూపర్ సిక్స్’ హామీలను పూర్తిగా గాలికొదిలిన చంద్రబాబు
- ఊరూరా బెల్ట్‌షాపులతో ఏరులై పారుతున్న మద్యం
- మద్యం షాపులు పూర్తిగా టీడీపీ నేతల చేతుల్లోనే..
- ఉమ్మడి జిల్లాలోని 14 నియోజకవర్గాల్లో అడుగడుగునా అవినీతి
- ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఏడాదిలో 61 మంది రైతుల ఆత్మహత్య
- నేడు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో వెన్నుపోటు దినోత్సవ ర్యాలీ

సాక్షి ప్రతినిధి, కర్నూలు: టీడీపీ కూటమి పాలనలో అవినీతి తాండవిస్తోంది. బహిరంగంగానే నేతలు, పార్టీ శ్రేణులు అక్రమాలకు తెగబడ్డారు. నేటితో సార్వత్రిక ఫలితాలకు సరిగ్గా ఏడాది. ఈ ఏడాది ‘కూటమి పాలన’ను విశ్లేషిస్తే మోసం, దగా మినహా ఎలాంటి అభివృద్ధి జరగలేదని ఇట్టే తెలుస్తోంది. ఉమ్మడి జిల్లాలో 18,712 వలంటీర్లను తొలగించి రోడ్డున పడేయడం, సూపర్‌సిక్స్ హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేయడం.. చివరకు పింఛన్, రేషన్ కావాలన్నా సచివాలయాల చుట్టూ, రేషన్ దుకాణాల చుట్టూ తిరిగే దారుణ పరిస్థితి కల్పించడం గమనార్హం. ఆదోని, శ్రీశైలం, ఎమ్మిగనూరు, కోడుమూరు, ఆళ్లగడ్డ, కర్నూలు, పాణ్యంతో పాటు అన్ని నియోజకవర్గాల్లో ఇసుక, గ్రావెల్ దందా పెద్ద ఎత్తున నడుస్తోంది. ఆదోనిలో డబ్బులు ఇవ్వకపోతే ఎమ్మెల్యే అనుచరులు ఏకంగా భౌతిక దాడులకు దిగారు. ఎమ్మిగనూరు నియోజకవర్గంలో గురజాల జయరాముడు, రాయచోటి నాగిరెడ్డి ఇద్దరూ ఇసుక దోపిడీకి తెగబడిన ఆడియో కూడా వైరల్ అయింది. ‘సీఐకి రూ.50వేలు ఇచ్చినా, ఎమ్మెల్యేకి చెప్పి ఇసుక తోలుతున్నా, దమ్ముంటే రమ్మను జయరాం’ అని నాగిరెడ్డి బహిరంగంగానే బెదిరించారు. ఆళ్లగడ్డలో ఇసుక కావాలంటే ఏ పల్లెకు వెళ్లినా, ఎంతకు కొనుగోలు చేసినా ట్రిప్పునకు రూ.2వేల చొప్పున బీట్యాక్స్ చెల్లించాల్సిందే. పాణ్యం నియోజకవర్గం పూడిచెర్లతో పాటు పలు చోట్ల గ్రావెల్ దందా విచ్చలవిడిగా సాగుతోంది. శ్రీశైలం నియోజకవర్గం మహానంది మండల టీడీపీ నేతల ఫోన్ సంభాషణలో ‘ఆపోజిట్ వాళ్లు ఎవడైనా బండి ఆపితే టిప్పర్‌తోనే కొడతా.. రమ్మను’ అని మట్టి అక్రమ తరలింపు విషయంలో బరితెగించి మాట్లాడటం గమనార్హం.

**‘పచ్చ’పాతమే..**

మంత్రి టీజీ భరత్ తన వ్యవహార శైలి మార్చుకోకపోతే తానే రంగంలోకి వస్తానని మాజీ మంత్రి కేఈ ప్రభాకర్ ఇటీవల బహిరంగంగానే హెచ్చరించారు. నాయకులు, కార్యకర్తలకు ఆయన అందుబాటులో ఉండడం లేదని.. ఆధార్ కార్డు చూసి పనులు చేయడం ఏమిటని ప్రశ్నించారు. రాజకీయాలకు అతీతంగా సేవ చేయాల్సిన నేతల ‘పచ్చ’పాతం ప్రభాకర్ వ్యాఖ్యలతో తేటతెల్లమైంది.

**పాలనలో ‘విశ్వసనీయత’**

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019 మే 20న ప్రమాణస్వీకారం చేశారు. జూలై 12న పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఇందులో మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలలో 99శాతం ప్రవేశపెట్టారు. ఐదేళ్లు వాటికి నిధులు కేటాయించారు. మేనిఫెస్టోకు విశ్వసనీయత, ప్రజలకు మాట ‘చెప్పామంటే...చేయాలంతే’ అనేలా పాలన సాగించారు. ఐదేళ్లలో ముఖ్య పథకాలకు జిల్లాకు రూ.10,136.85కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు.

### ఊరూరా బెల్ట్‌షాపులు.. బాటిల్‌పై రూ.10–20 అ‘ధన’ం

మద్యం పాలసీ ద్వారా కూటమి ప్రభుత్వం భారీగా దండుకుంటోంది. విపక్షపార్టీ నేతలకు దుకాణాలు వచ్చినా వారి నుంచి బలవంతంగా లాక్కుని తమ గుప్పిట్లో పెట్టుకున్నారు. తెలంగాణవాసులు వడ్డెంపూడి నరేశ్(షాపు నెంబర్ 36), విజయ్, భరత్ గౌడ్ (షాపు నెంబర్24), వింజమూరి కృష్ణారెడ్డి(షాపు నెంబర్ 22) దుకాణాలు దక్కాయి. వీరికి కోడుమూరు టీడీపీ ఇన్‌చార్జ్ విష్ణువర్ధన్‌రెడ్డి, అనుచరుల నుంచి ఫోన్‌లో బెదిరింపులు వచ్చాయని, ఫోన్ నెంబర్‌తో సహా ముఖ్యమంత్రి, ఇన్‌చార్జ్, ఎక్సైజ్, హోంమంత్రులకు, సీఎస్, కలెక్టర్‌కు మెయిల్, వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేశారు. తామూ టీడీపీ సానుభూతి పరులమే అని ఇంత అన్యాయం ఏంటని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఉదాహరణలు చూస్తే జిల్లాలో మద్యం దందా ఏ స్థాయిలో సాగుతుందో అర్థమవుతుంది. గత 5 ఏళ్లలో ఏ పల్లెలో ఒక్క బెల్ట్‌దుకాణం లేదు. ఈ ఏడాది ప్రతీ పల్లెలో బెల్ట్‌షాపులు ఏర్పాటు చేసి విచ్చలవిడిగా మద్యం విక్రయిస్తున్నారు.



నంద్యాలలో మద్యం దుకాణం పక్కన అనధికార పర్మిట్ రూమ్

### వైఎస్సార్‌సీపీ ఉద్యమబాట

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే ప్రజాగ్రహానికి గురైంది. ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో పిల్లల చదువులు, రైతుల వ్యవసాయం అన్నీ సంక్షోభంలో పడ్డాయి. దీంతో ప్రజాక్షేత్రంలో ఆందోళన బాట పట్టింది. గతేడాది డిసెంబర్ 13న రైతులకు మద్దతుగా ‘రైతు పోరు’, అదే నెల 27న విద్యుత్ చార్జీల పెంపుపై కలెక్టరేట్‌ల ముట్టడి, ఈ ఏడాది మార్చి 12న యువపోరుతో ఆందోళన నిర్వహించారు. ఏడాదిలో 61మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారంటే వ్యవసాయాన్ని కూటమి ప్రభుత్వం ఏస్థాయిలో నిర్లక్ష్యం చేసిందో ఇట్టే తెలుస్తోంది.

### నేడు అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో వెన్నుపోటు దినోత్సవం

కూటమి ఇచ్చిన హామీలు నెరవేర్చకపోగా ప్రజలకు వెన్నుపోటు పొడిచి పథకాలు అమలు చేయకపోవడంపై నేడు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 14 నియోజకవర్గ కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టనుంది. భారీ ఎత్తున కార్యకర్తలు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పార్టీ అధ్యక్షులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఎస్వీ మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు.

## ప్రజలను మోసం చేసిన ప్రభుత్వాన్ని నిలదీద్దాం

● వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి



కర్నూలు(టౌన్): ఏడాది గడిచినా ఎన్నికల హామీలు నెరవేర్చకుండా మోసం చేసిన చంద్రబాబు ప్రభుత్వాన్ని ప్రతి ఒక్కరూ నిలదీయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి పిలుపు నిచ్చారు. మంగళవారం సాయంత్రం స్థానిక ఎస్వీ కాంప్లెక్స్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కన్నా రెండింతలు ఎక్కువగా ఈ రాష్ట్రంలో సంక్షేమ పాలన అందిస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించాడన్నారు. గతంలో అన్ని వర్గాల ప్రజలకు మంచి సేవలు అందించిన వలంటీర్లకు రూ.10 వేల వేతనం ఇస్తామని చెప్పి ఏకంగా ఉద్యోగాలే లేకుండా చేశాడన్నారు. ఇక రేషన్ కష్టాలు చెప్పనలవి కాకుండా ఉన్నాయన్నారు. కూటమి సర్కార్ ఎండీయూ వాహనాలను తొలగించడంతో వాటినే నమ్ముకున్న వేలాది కుటుంబాలు వీధిన పడ్డాయన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలను మోసం చేసిన చంద్రబాబు పాలనపై బుధవారం వెన్నుపోటు దినం పేరుతో నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.స్థానిక గౌరి గోపాల్ ఎదురుగా ఉన్న ధర్నా చౌక్ నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో కలెక్టరేట్ వరకు ర్యాలీ చేపడతామన్నారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తామన్నారు.


# అహోబిలేశా.. బీ ట్యాక్స్ కట్టలేము!

- పుణ్యక్షేత్రంలో ఆగని పచ్చ దందా
- నాలుగు నెలల క్రితం వంద లాడ్జీ నిర్వాహకులతో మామూళ్ల ఒప్పందం
- మాట వినని 17 లాడ్జీల యజమానులపై అధికారులతో వేధింపులు
- ప్రస్తుతం కప్పం కట్టిన ముగ్గురికి మినహాయింపు
- అనుమతులు లేవంటూ 14 లాడ్జీలు కూల్చేస్తామని నోటీసులు



ఈ కథనం సాక్షిలో ప్రచురితమైంది. అహోబిలం క్షేత్రంలో అనుమతులు లేని లాడ్జీలపై వార్తా కథనం ఇది. ఆ తర్వాత ఈ లాడ్జీలకు అనుమతి లేదని కరెంట్ కట్ చేస్తున్నామని నోటీసులు ఇచ్చారు. అయినా స్పందించక పోవడంతో కరెంట్ కట్ చేశారు. అయితే ఇప్పుడు వీరభద్ర, వేదపాఠశాల, సుదర్శన్ కాంప్లెక్స్ అనే మూడు లాడ్జీలకు నోటీసులు ఇవ్వక పోవడంతో ఆ లాడ్జీల నిర్వాహకులు పెద్ద మొత్తంలో బీ ట్యాక్స్ కట్టారని, అందుకే అవి సక్రమమయ్యాని గుసగుసలాడుకుంటున్నారు.

సాక్షి టాస్క్ ఫోర్స్: ఇందుగలడందు లేడని సందేహం వలదు... ఎందెందు వెతికినా.. అందందే తమ అవినీతి, అక్రమ సంపాదన అన్న చందంగా మారింది.. ఆళ్లగడ్డలో నియోజకవర్గంలో అధికార పార్టీనేతల దందా. అభివృద్ధి పనుల్లో పర్సెంటేజీల పేరిట అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న అధికార పార్టీ ముఖ్యనేత ప్రముఖ పుణ్యక్షేత్రం అహోబిలంలో లాడ్జీలనూ వదలడం లేదు. ఎవరికీ అనుమతులు లేవు అంటూ.. పంచాయతీరాజ్, రెవెన్యూ, ఇరిగేషన్, విద్యుత్ శాఖల అధికారులతో నెలల తరబడి వేధింపులకు పాల్పడి వసూళ్ల దందాకు తెరలేపారు. కొందరు తమ వల్ల కాదని చేతులెత్తేశారు. దీంతో 14 లాడ్జీలు కూల్చి వేస్తామని నిర్వాహకులకు నోటీసులు ఇవ్వడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అహోబిలంలో చిన్న, పెద్ద లాడ్జీలు, సత్రాలు సుమారు 100 వరకు నిర్మించుకుని వ్యాపారాలు చేసుకుంటున్నారు. వీటిపై అధికార పార్టీ ముఖ్యనేత కన్నుపడటంతో వెంటనే వసూళ్ల బాధ్యత ఓ తమ్ముడికి అప్పగించారు. ఎప్పుడో 20 సంవత్సరాల క్రితం నిర్మించుకున్న వాటికి నోటీసులు ఇచ్చి బెదిరించారు. ఇదేమిటనీ ప్రశ్నిస్తే ‘అన్న’ దగ్గరకు వెళ్లి ఎంతో కొంత ఇస్తామని మాట్లాడుకోమని సలహా ఇచ్చారు. అయినా ఎవరూ స్పందించక పోవడంతో ఇవన్నీ కాలువపై ఉన్నాయి.. అని ఇరిగేషన్ శాఖ, రెవెన్యూ ఆధీనంలో ఉన్న పొలంలో కట్టారని తహసీల్దార్, సర్వేయర్ ఇలా అన్ని శాఖల అధికారులతో సర్వే చేయించారు. భయపడిన చాలా మంది మామూళ్లు ఇచ్చేందుకు ఒప్పందం చేసుకున్నారు. అయితే 17 లాడ్జీల నిర్వాహకులు కప్పం కట్టేందుకు ముందుకు రాక పోవడంతో విద్యుత్ అధికారులను పంపించి దౌర్జన్యంగా కరెంట్ కట్ చేయించారు. దీంతో ఆందోళన చెందిన మరో ముగ్గురు వెళ్లి బీ ట్యాక్స్ కట్టారు. ఇక మిగిలింది 14 మందికి ‘మీ లాడ్జీలను కూల్చి వేస్తామని’ అంటూ మంగళవారం మరోమారు నోటీసులు ఇవ్వడం చర్చనీయాంశం అయింది. ఇదేంటి మొన్నటి దాక 17 లాడ్జీలు అన్నారు. ఇప్పుడు 14 ..ఎందుకు అని అధికారులను ఆరా తీయగా..ఆ ముగ్గురు బీ ట్యాక్స్ కట్టారు.. మీరు కట్టేయండి అంటూ ఉచిత సలహా ఇచ్చినట్లు తెలుస్తోంది.



లాడ్జీ యజమానులకు ఇచ్చిన నోటీసులు

**డబ్బులు ఇస్తాం.. క్రమబద్ధీకరిస్తారా ?**

అహోబిలంలో ప్రభుత్వ భూములు ఉన్నాయి. నిర్మాణాలకు చాలా వాటికి అనుమతులు లేవు. అధికార పార్టీ నేతలు రూ. లక్షలు డబ్బులు ఇవ్వండి అని బెదిరిస్తున్నారు. ఇప్పుడు ఇస్తాం. మరో నెలకో ఏడాదికో వచ్చి మళ్లీ అక్రమ నిర్మాణాలే కదా డబ్బులు ఇవ్వమంటే ఎలా? అడిగినంత డబ్బులు ఇస్తాం.. అన్ని క్రమబద్ధీకరణ చేసి ధ్రువీకరణ పత్రాలు ఇస్తారా చెప్పండి. లేకుంటే వారికి ఎప్పుడు డబ్బులు అవసరమైతే అప్పుడు వచ్చి కప్పం కట్టాలని బెదిరిస్తే ఏం చేయాలి. – లాడ్జీ యజమాని

**ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు..**

నేను కొత్తగా ఇన్‌చార్జిగా బాధ్యతలు తీసుకున్నా. గతంలో ఏం జరిగిందో నాకు తెలియదు. ప్రస్తుతం 14 మందికి నోటీసులు ఇవ్వమని ఈఓపీఆర్డీ ఆదేశాలు ఇవ్వడంతో వారికి మాత్రమే నోటీసులు ఇవ్వడం జరిగింది. – సుదర్శన్‌రెడ్డి, పంచాయతీ సెక్రటరీ

### సమ్మెలోకి మున్సిపల్ కార్మికులు

కర్నూలు(టౌన్): నగరపాలక సంస్థ మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం కార్మికులు మంగళవారం అర్ధరాత్రి నుంచి విధులను బహిష్కరించి సమ్మెబాట పట్టారు. ఈ మేరకు ఇప్పటికే మున్సిపల్ ఉన్నతాధికారులకు సమ్మె నోటీసు అందజేశారు. గత రెండు వారాలుగా మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కారించాలని నగరపాలక సంస్థ ఎదుట ధర్నాలు, నిరసన దీక్షలు చేపడుతున్నారు. అయినా ప్రభుత్వంలో చలనం రాకపోవడంతో అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు 363 మంది ఉద్యోగులు విధులను బహిష్కరించి సమ్మె చేస్తున్నట్లు ప్రకటించారు. సీఎం దృష్టికి తీసుకెళ్లినా తమ సమస్యలు పరిష్కారం కాలేదని, విధిలేని పరిస్థితుల్లో సమ్మెలోకి వెళ్తున్నట్లు అసోసియేషన్ నాయకులు వెంకటేశ్వర్లు, యాసిన్‌బేగ్ తెలిపారు. సమ్మె నేపథ్యంలో అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు.

## అమ్మాయిలకు అసభ్య చిత్రాలు

● పోలీసుల అదుపులో పెద్దాసుపత్రి టెక్నీషియన్

కర్నూలు: అమ్మాయిలకు అసభ్య చిత్రాలు, మెసేజ్‌లు పంపుతూ కాంట్రాక్టు పారా మెడికల్ ఉద్యోగి పైశాచికానందం పొందుతున్నాడు. ఇటీవల ఓ అమ్మాయికి ఇలాగే అసభ్య చిత్రాలు, వీడియోలు పంపడంతో ఆమె స్థానిక మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో మంగళవారం ఉదయం నుంచి ఆ ఉద్యోగి కోసం పోలీసులు గాలించారు. మధ్యాహ్నం తర్వాత అతను ఏఎంసీలోని ఓ గదిలో ఉన్నట్లు సమాచారం అందడంతో పోలీసులు మఫ్టీలో వెళ్లి అదుపులోకి తీసుకున్నారు.

- ఆరు నెలల క్రితం సైతం ఇదే ఉద్యోగి క్యాజువాలిటీలో పనిచేస్తూ హౌస్‌సర్జన్‌కు అసభ్య మెసేజ్‌లు పంపించాడు. దీంతో ఆమె తోటి హౌస్‌సర్జన్లకు విషయం చెప్పడంతో వారు దేహశుద్ధి చేశారు.
- పదేళ్ల క్రితం సైతం ఓ మహిళా హౌస్ సర్జన్‌కు ప్రభుత్వాసుపత్రిలోని ఈసీజీ గదిలో అక్కడి టెక్నీషియన్‌తో కలసి ఈసీజీ తీస్తున్నట్లు నటించి పలుమార్లు స్కాన్ చేశారు. ప్రభుత్వాసుపత్రిలో ఈసీజీ మిషన్ సరిగా లేదని చెప్పి గాయత్రి ఎస్టేట్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లి పలుమార్లు ఈసీజీ తీసి పైశాచికానందం పొందడం గమనార్హం.
- అనుమానం వచ్చిన ఆమె విషయాన్ని స్నేహితులకు చెప్పడంతో అప్పటి ఓ అధికారి, హౌస్ సర్జన్లు కలసి ఈ పారా మెడికల్ ఉద్యోగికి దేహశుద్ధి చేశారు.
- పలుమార్లు అమ్మాయిల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం, వారు దేహశుద్ధి చేస్తున్నా అతని ప్రవర్తనలో మార్పు రావడం లేదని ఆసుపత్రి ఉద్యోగుల్లో చర్చ జరుగుతోంది.

## ఇంటింటికీ మద్యం సరఫరా ఘనత బాబుది

● వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా పరిశీలకులు కల్పలతారెడ్డి, అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి



చిన్నారి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కల్పలతారెడ్డి, కాటసాని, వైఎస్సార్‌సీపీ నేతలు

చాగలమర్రి: కూటమి ప్రభుత్వం ఇంటింటికి రేషన్ పంపిణీని రద్దు చేసి ఇంటింటికి మద్యం సరఫరా చేస్తుందని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా పరిశీలకులు కల్పలతారెడ్డి, అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం వారు మాజీ ఎమ్మెల్యేలు గంగుల బిజేంద్రారెడ్డి, శిల్పా చక్రపాణిరెడ్డి, మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, పార్టీ నేత భూమా కిశోర్‌రెడ్డితో కలిసి తోడేండ్లపల్లె గ్రామాన్ని సందర్శించి ఇటీవల హత్యాచారానికి గురైన చిన్నారి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా చిన్నారి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆ తర్వాత వైఎస్సార్‌సీపీ తరఫున రూ.2 లక్షల చెక్కును అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ ఊరూరా బెల్ట్‌షాపులతో మద్యం ఏరులై పారుతుందన్నారు. మద్యం మత్తులో మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలకు పాల్పడుతున్నారన్నారు. తోడేండ్లపల్లె చిన్నారి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్న, చంద్రబాబు పాలనలో తేడాను ప్రజలు గమనించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ సెల్ ప్రధానకార్యదర్శి షేక్ బాబులాల్, చాగలమర్రి ఎంపీపీ వీరభద్రుడు, ఆళ్లగడ్డ ఎంపీపీ రాఘవేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### క్వార్టర్ల దుర్వినియోగంపై చర్యలు తీసుకోండి

● కర్నూలు కలెక్టర్‌ను ఆదేశించిన లోకాయుక్త

**కర్నూలు(సెంట్రల్):** కర్నూలులో ప్రభుత్వ ఉద్యోగుల కోసం నిర్మించిన ఏ, బీ, సీ క్వార్టర్లను దుర్వినియోగం చేస్తున్న అనధికార వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను లోకా యుక్త ఆదేశించింది. ప్రభుత్వ క్వార్టర్లు దుర్వినియోగమవుతున్నాయని జగన్ అనే వ్యక్తి లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. నిర్దేశిత ఫార్మాట్‌లో ఫిర్యాదు లేకున్నా.. ప్రభుత్వ ఆస్తులకు సంబంధించిన విషయం కావడంతో విచారణకు స్వీకరించినట్లు లోకాయుక్త తెలిపింది. ఏ, బీ, సీ క్యాంపుల్లోని క్వార్టర్ల ప్రస్తుత స్థితిగతిని తెలుసుకునేందుకు వెంటనే సర్వేను నిర్వహించాలని కలెక్టర్‌ను ఆదేశించింది. ప్రతి ఇంటిని సర్వే చేసి ఆక్రమణకు గురైనా, వ్యాపార సంస్థలకు లీజు ఇచ్చినా, అనధికార వ్యక్తులు ఉన్నా గుర్తించి పూర్తి వివరాలను రికార్డులో డీఆర్వోతో నమోదు చేయించాలని ఆదేశించింది. అనధికార వ్యక్తులు, సబ్‌లీజుకు ఇచ్చిన సందర్భాలు ఉంటే చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని ఉప లోకాయుక్త జస్టిస్ పి.రజనీ ఆదేశించారు.

### క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**నంద్యాల(న్యూటౌన్):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ వైఎస్సార్ కడప క్రీడా పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి 4, 5 తరగతుల ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి రాజు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నాల్గవలో ప్రవేశానికి 2015 ఏప్రిల్ 1 నుంచి 2017 మార్చి 31, ఐదవ తరగతిలో ప్రవేశానికి 2014 ఏప్రిల్ 1 నుంచి 2016 మార్చి 31 మధ్య జన్మించి, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదువుతున్న వారు అర్హులన్నారు. ఈనెల 19లోగా https://apsportsschool.ap.gov.in/లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వచ్చే నెల 1 నుంచి 3వ తేదీ వరకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే శారీరకదారుఢ్య పరీక్షలకు ఒరిజినల్ పత్రాలతో హాజరు కావాలన్నారు. ఎంపికైన విద్యార్థులు అదే నెల 10, 11వ తేదీల్లో ఏపీ క్రీడా ప్రాధికార సంస్థ రాష్ట్రస్థాయి ఎంపికలకు హాజరవుతారన్నారు. మరింత సమాచారం కోసం 8712622576 నంబరును సంప్రదించాలన్నారు.

### ఇసుక మాయం



సీజ్ చేసిన ఇసుక మాయమైన దృశ్యం

**సి.బెళగల్:** మండల కేంద్రంలోని రెవెన్యూ ఆధ్వర్యంలో ఉన్న ఇసుక మాయమైంది. మండల పరిధిలోని తుంగభద్ర నది నుంచి అక్రమంగా తరలిస్తున్న ఆరు ట్రాక్టర్ల ఇసుకను పోలీసులు పట్టుకుని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. సీజ్ చేసి తహసీల్దార్ కార్యాలయ ఆవరణంలో ఇసుకను నిల్వ చేశారు. కాగా మండల రెవెన్యూ అధికారుల నిఘా లేకపోవడంతో ఇసుకను గుర్తు తెలియని వ్యక్తులు తీసుకెళ్లారు. ఒకపక్క తహసీల్దార్ కార్యాలయం.. మరో పక్క పోలీస్ స్టేషన్ ఉన్నప్పటికీ సీజ్ చేసిన ఇసుక మాయమవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదే విషయమై ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తంను వివరణ కోరగా విచారిస్తానని సమాధానం ఇచ్చారు. ఎస్ఐ పరమేష్‌నాయక్ దృష్టికి తీసుకెళ్లగా తాము కేసు నమోదు చేసి రెవెన్యూ అధికారులకు అప్పగించామని, ఇసుక మాయంపై రెవెన్యూ అధికారులు ఫిర్యాదు చేస్తే విచారిస్తామని చెప్పారు.



గుత్తిరోడ్డు అమ్మ హోటల్ వద్ద ఫుట్‌పాత్‌పై మద్యం మత్తులో పడివున్న యువకుడు



నంద్యాల రైల్వేగేట్ వద్ద మత్తులో రోడ్డుపై పడివున్న వ్యక్తి

# రండి బాబూ రండి! తాగండి.. రోడ్లపై పొర్లండి

● టీడీపీ నాయకుల వ్యాపార రహస్యం ఇదే! ● పేదల పెట్టుబడే వారికి ఆదాయ వనరు



జాలి వైన్స్ పక్కనే అనుమతులు లేకున్నా మద్యం తాగిస్తున్న నిర్వాహకులు



శేగు థియేటర్ సమీపంలోని ఆటో స్టాండ్ వద్ద..



పోలీసుస్టేషన్ సమీపంలో..

పూటుగా మద్యం తాగి పొర్లుతున్న ఈ దృశ్యాలు కూటమి పాలన తీరుకు అద్దం పడుతున్నాయి. సరసమైన ధరలకు నాణ్యమైన మద్యాన్ని అందిస్తామని మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కొత్త సీసాలో పాత సారా వ్యాపారాన్ని కొనసాగిస్తూ పేదల ఒళ్లు, ఇళ్లను గుల్ల చేస్తోంది. డోన్ పట్టణంలో ఎక్కడ చూసినా మద్యం మత్తులో రోడ్లపై పడివున్న మందుబాబులే కనిపిస్తున్నారు. డోన్ నియోజకవర్గ వ్యాప్తంగా 16 మద్యం షాపులతో పాటు రెండు గీతా కార్మికుల మద్యం దుకాణాలున్నాయి. వీటికి తోడు కూల్‌డ్రింక్ షాప్‌లు, హోటళ్లు, కిల్లీ కొట్లలో సైతం మద్యాన్ని విక్రయిస్తూ టీడీపీ నేతలు సొమ్ము చేసుకుంటున్నారు. సిట్టింగ్‌కు అనుమతి లేకపోయినప్పటికీ ప్రతి మద్యం దుకాణం పక్కనే అదనపు గదులను ఏర్పాటుచేసి అందులో వాటర్‌ప్యాకెట్లు, స్నాక్స్ మద్యం ప్రియులకు అంటగట్టి జలగల్లా మద్యపానీయుల రక్తం పీల్చుతున్నారు. ప్రతి గ్రామంలోనూ ఏడెనిమిది బెల్టుషాపులను ఏర్పాటు చేసుకునేందుకు టీడీపీ నాయకుడొకడు.. ఒక్కో బెల్ట్‌షాప్‌కు రూ.25 వేల చొప్పున విక్రయదారుల నుంచి వసూలు చేసుకున్నారనే ఆరోపణలున్నాయి. టీడీపీ అగ్రనాయకునితో పాటు ఎక్సైజ్, సివిల్ పోలీసులకు మామూళ్లు ముట్టజెప్పేందుకే డిపాజిట్లు వసూలు చేశామని ఆ పార్టీ నాయకులు బాహాటంగా చెబుతుండటం గమనార్హం. **– డోన్**

# వెక్కిరిస్తున్న మొండి గోడలు!

● చెంచుల ఆశలపై నీళ్లు
● ఇళ్లు మంజూరు చేసిన ప్రభుత్వం
● నిర్మించి ఇస్తామంటూ ఓ టీడీపీ నాయకుడు డబ్బు వసూలు
● బేస్ లెవెల్‌లోనే నాసిరకం నిర్మాణం
● అభ్యంతరం చెబుతున్న హౌసింగ్ అధికారులు



బాధితులు

స్థానిక చెంచు కాలనీ వాసుల పక్కా ఇళ్ల ఆశలపై అదే కాలనీకి చెందిన ఓ టీడీపీ నాయకుడి బ్యాచ్ నాసిరకం నీళ్లు చల్లారు. సొంతిళ్లను తాము నిర్మించుకోలేమని అధికారులకు విన్నవించుకున్న చెంచులకు.. తాను నిర్మించి ఇస్తామని రెండో పార్టీగా ముందుకొచ్చిన టీడీపీ నాయకుడు, ఓ విశ్రాంత ఇంజినీరు, నంద్యాలకు చెందిన మరొకరు కలిసి 17 మంది లబ్ధిదారులతో ఒప్పందం చేసుకుని పనులు ప్రారంభించారు. నిర్మాణాలు నాసిరకంగా ఉన్నాయని హౌసింగ్ అధికారులు బేస్‌లెవెల్‌లోనే గుర్తించి అభ్యంతరం తెలపడంతో మధ్యలోనే ఆగిపోయాయి. దీంతో చెంచులు దిక్కుతోచని స్థితిలో ఉండిపోయారు.



బేస్ లెవెల్‌లో నిలిచిపోయిన నిర్మాణాలు

**పాణ్యం:** పీఎం జన్మన్ కింద ప్రభుత్వం చెంచులకు 173 ఇళ్లు మంజూరు చేశారు. ఒక్కో ఇంటి నిర్మాణం కోసం రూ.2.39 లక్షలు మంజూరు చేయగా చెంచులకు అదనంగా రూ.లక్ష చొప్పున అందిస్తున్నారు. దీంతో ఒక్కో ఇంటికి రూ.3.39 లక్షలు కేటాయించారు. ఇప్పటి వరకు కాలనీలో ఒక ఇల్లు పూర్తికాగా స్లాబ్‌లెవెల్ 10, ఆర్ఎల్‌లెవెల్–10, లెంటల్ లెవెల్–8, బేస్‌వెల్–20 నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇంకా 124 ఇళ్లు ప్రారంభించలేదు.

**బేస్ లెవెల్‌లో నిలిచిన నిర్మాణాలు**

చెంచు కాలనీకి చెందిన 17 మంది లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలను టీడీపీ నాయకుడు చేపట్టాడు. వీటిలో 11 ఇళ్ల నిర్మాణాలకు బేస్ లెవెల్‌లో పూర్తి చేశాడు. వీటికి బిల్లు పెట్టాలని కోరగా నిర్మాణాలను పరిశీలించిన హౌసింగ్ అధికారులు నాసిరకంగా ఉన్నాయని తేల్చి చెప్పారు. ప్రస్తుతం 11 ఇళ్లకు బిల్లు పెట్టని కారణంగా చెంచుల సొంతింటి కలపై నీలినీడలు అలుముకున్నాయి. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా నాణ్యతను తనిఖీ చేయాలని ఆదేశించినట్లు సమాచారం. ఈ క్రమంలో నెలలు గడుస్తున్నా నిర్మాణాల్లో ఎలాంటి అభివృద్ధి లేకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు నాసిరకంగా ఉన్నా సరే బిల్లులు చేయాలని సదరు టీడీపీ నాయకుడు ఒత్తిళ్లు తెస్తున్నట్లు సమాచారం.

**నిరాశ్రయులుగా మిగిలి..**

సొంతిల్లు వస్తుందనే ఆశతో కొన్ని నెలల నుంచి చెంచులు ఉన్న గుడిసెలను పీకేసుకున్నారు. వాటి స్థానంలో ఇళ్లకు బేస్ లెవెల్‌లో నిర్మాణాలు చేపట్టారు. త్వరగా ఇల్లు కడతారనుకుని బంధువుల ఇళ్లలో కొందరు, ఖాళీ స్థలాల్లో మరికొందరు జీవనం సాగిస్తున్నారు. ఈక్రమంలో నాసిరకంగా ఉన్నాయంటూ మధ్యలో నిర్మాణాలు ఆగిపోవడంతో చెంచులు టీడీపీ నాయకుడిపై తీవ్రంగా మండిపడుతున్నారు. అధికారులే తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

**మా దృష్టికి రాలేదు**

పాణ్యం చెంచుకాలనీలో హౌసింగ్ విషయంలో ఈ సమస్యలను లబ్ధిదారుల ఎవరూ మా దృష్టికి తీసుకురాలేదు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. నిర్మాణాలు పకడ్బందీగా నాణ్యతతో చేపట్టాలి. నిబంధనలు తప్పకుండా పాటించాలి.

– ఏవీఎస్ఎన్ మూర్తి, హౌసింగ్ డీఈఈ

## ట్రాక్టర్ బోల్తా పడి ఇద్దరు కూలీల మృతి





శివారెడ్డి, అబ్దుల్‌రసూల్ మృతదేహాలు

**బనగానపల్లె రూరల్:** మండలంలోని ఎస్ కొత్తూరు గ్రామ సమీపంలో నాపరాయి లోడు ట్రాక్టర్ బోల్తా పడి కూలీలు ఎం శివారెడ్డి(49), ఎస్ అబ్దుల్‌రసూల్ (50) దుర్మరణం చెందారు. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాలు.. పలుకూరు గ్రామానికి చెందిన శివారెడ్డి, నందవరం గ్రామానికి చెందిన ఎస్ అబ్దుల్‌రసూల్ మంగళవారం నాపరాయి లోడింగ్ కోసం కూలీ పనికి వెళ్లారు. పలుకూరు గ్రామం నుంచి నాపరాయిని నంద్యాలకు తరలించేందుకు ట్రాక్టర్ ట్రాలీపై కూర్చొని బయలుదేరారు. నందివర్గం రైల్వే వంతెన దాటిన తరువాత ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో ట్రాక్టర్ అదుపు తప్పి ట్రాలీ బోల్తాపడింది. ప్రమాదంలో ట్రాలీపై కూర్చున్న శివారెడ్డి, అబ్దుల్‌రసూల్‌పై నాపరాళ్లు పడటంతో శివారెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రంగా గాయపడిన అబ్దుల్‌రసూల్‌ను బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నందివర్గం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాల్సి ఉంది. మృతుడు శివారెడ్డికి భార్య లక్ష్మీనారాయణమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎస్ అబ్దుల్‌రసూల్‌కు భార్య హుస్సేన్‌మీతోపాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు.

**కేసీ కాల్వలో ట్రాక్టర్ బోల్తా పడి..**



మృతి చెందిన శ్రీకాంత్‌రెడ్డి

**గోస్పాడు:** కేసీ కాల్వలో ట్రాక్టర్ బోల్తా పడి కౌలు రైతు దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. నంద్యాల మండలం కొత్తపల్లె గ్రామానికి చెందిన బొమ్మిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి(30) గోస్పాడు మండలం సాంబవరం గ్రామ సమీపంలో ఆరు ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకున్నాడు. పొలాన్ని దుక్కి దున్నేందుకు మంగళవారం ట్రాక్టర్‌తో కేసీ కాల్వ గట్టు మీదుగా శ్రీకాంత్‌రెడ్డి బయలుదేరాడు. ఈ క్రమంలో ట్రాక్టర్ అదుపు తప్పి కేసీ కాల్వలోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ప్రమాదంలో ట్రాక్టర్ నడుపుతున్న శ్రీకాంత్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్ఐ సుధాకర్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడి సోదరుడు వెంకటసుబ్బారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## గుండె పోటుతో మహిళ మృతి



బస్టాండ్‌లో ప్రాణాలు కోల్పోయిన అంజనమ్మ

**వెల్దుర్తి:** ఆసుపత్రికి వెళ్లేందుకు బస్సు కోసం ఎదురుచూస్తున్న వృద్ధురాలు స్థానిక పాతబస్టాండ్‌లోనే గుండెపోటుతో మృతి చెందింది. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాలు.. బోగోలుకు చెందిన గొల్ల అయ్యమ్మ(62) అనారోగ్యంతో బాధ పడుతుండటంతో భర్త అయ్యస్వామి, కుమార్తె, అల్లుడు కలిసి మంగళవారం కర్నూలు ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు ఆటోలో వెల్దుర్తికి చేరుకున్నారు. పాతబస్టాండులో బస్సు కోసం ఎదురు చూస్తూ ఉండగా తీవ్ర అస్వస్థతకు గురై అయ్యమ్మ కుప్పకూలిపోయింది. కుటుంబ సభ్యులు, స్థానికులు, డ్యూటీ పోలీసుల సాయంతో స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు. కుటుంబ సభ్యులు మృతదేహాన్ని అంత్యక్రియల నిమిత్తం స్వగ్రామానికి తీసుకెళ్లారు. కాగా పాతబస్టాండులో బస్‌షెల్టర్ ఉన్నా ప్రయాణికులకు అనుకూలంగా లేకపోవడంతో బస్సుల కోసం ఎండా, వానల్లో నిలుచుని ఉండాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ఇదే కోవలో అయ్యమ్మ కూర్చునేందుకు అవకాశం లేకపోవడంతో నిలుచొని ఉండటంతో అసలే అనారోగ్యంతో ఉన్న ఆమె తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందినట్లు తెలుస్తోంది. అధికారులు పాతబస్టాండులో ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉంది.

## ఆస్తి కోసం తండ్రిని చంపిన తనయులు



హత్యకు గురైన వెంకటేశ్వర్లు

**కర్నూలు:** కర్నూలు మండలం పడిదెంపాడు గ్రామంలో రెడ్డిపోగు వెంకటేశ్వర్లు (55) దారుణ హత్యకు గురయ్యాడు. వెంకటేశ్వర్లుకు ఇద్దరు భార్యలు. మొదటి భార్యకు ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు సంతానం. ఆమె చనిపోవడంతో రెండవ భార్య రెడ్డిపోగు సువేదమ్మను వివాహం చేసుకున్నాడు. ఈమెకు ఒక కూతురు సంతానం. రెండో వివాహం చేసుకున్న తర్వాత మొదటి భార్య పిల్లలకు ఆస్తి పంపకాలు చేశాడు. అయితే కొంతకాలం క్రితం మరో 2.20 ఎకరాలు కొనుగోలు చేశాడు. అందులో కూడా తమకు వాటా ఇవ్వాలంటూ మొదటి భార్య పిల్లలతో కొంతకాలంగా గొడవ జరుగుతోంది. పలుమార్లు ఆస్తి కోసం తగాదా జరిగినప్పటికీ వెంకటేశ్వర్లు వాటా ఇవ్వలేనని తేల్చిచెప్పాడు. దీంతో మంగళవారం ఉదయం వెంకటేశ్వర్లు పొలంలో ఉండగా మొదటి భార్య పిల్లలు కృష్ణ, స్వాములు, చిన్న స్వాములు, లక్ష్మి, రేణుక, చిన్న రేణుకతో పాటు మరో పది మంది కుటుంబ సభ్యులు అతని కంట్లో కారం కొట్టి ఇనుపరాడ్లు, కట్టెలతో బాదడంతో తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలో పడిపోయాడు. రెండో భార్య సువేదమ్మ వచ్చి ఆయన్ను కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స ప్రారంభించిన గంటలోపే మృతిచెందాడు. సువేదమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మొదటి భార్య కుమారులు, కుమార్తెలతో పాటు మొత్తం 16 మందిపై కేసు నమోదు చేసినట్లు కర్నూలు అర్బన్ తాలూకా సీఐ శ్రీధర్ తెలిపారు.

## బెల్లం ఊట ధ్వంసం

**నందికొట్కూరు:** పట్టణ పరిధిలోని నీలిషికారిపేట, మండల పరిధిలోని కోళ్లబావాపురం గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో మంగళవారం ఎక్సైజ్ అధికారులు సోదాలు నిర్వహించి 600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. నీలిషికారిపేటలో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 300 లీటర్ల బెల్లం ఊటను, కోళ్ల బావాపురం అటవీలో 300 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. రామేశ్వరి, బీసమ్మల నుంచి 5 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

## కోకిల బాషాపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు

● 12వ వార్డు టీడీపీ కార్పొరేటర్ ఫిర్యాదుతో చర్యలు

**కర్నూలు(టౌన్):** 20 ఏళ్లకు పైగా ఇంటర్నెట్ వ్యాపారం చేసుకుంటున్న కోకిల బాషాపై మంగళవారం ఒకటవ పట్టణ పోలీసు స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైంది. 12వ వార్డుకు చెందిన టీడీపీ కార్పొరేటర్ క్రాంతికుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు ఆయనపై కేసు నమోదు చేశారు. సుంకేసుల రోడ్డులోని సంజీవనీ హాస్పిటల్ సమీపంలోని స్థల విషయంలో ఇరువురి మధ్య వివాదం జరిగిందని, అందులో భాగంగానే ఈ కేసు పెట్టినట్లు పోలీసులు వెల్లడించారు.

**మంత్రి కుటుంబం వేధింపులే కారణమా..?**

ఓ మంత్రి కుటుంబం వేధింపుల వల్లే మైనార్టీకి చెందిన కోకిల బాషాపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలుస్తోంది. మూడు నెలల క్రితం తాండ్రపాడులో సివిల్ పంచాయతీ విషయంలోనూ ఆయనపై రౌడీషీట్ ఓపెన్ చేశారు. ఎన్నికల సమయంలో మంత్రి కుటుంబం ఆయన్ను పిలిపించి తమకు మద్దతుగా నిలవాలని ఒప్పించే ప్రయత్నం చేశారు. అయితే కర్నూలు నియోజవర్గానికి కలెక్టర్‌గా పనిచేసి రాజీనామా చేసిన ముస్లిం మైనార్టీకి చెందిన ఇంతియాజ్‌కు ఆయన మద్దతుగా నిలిచారు. ఎన్నికల సమయంలోనూ ఆయన ఇంతియాజ్ వెంట తిరిగారు. అప్పట్లో సహకరించలేదన్న కారణంతో ఉమ్మడి వ్యాపారంలో భాగస్వాములైన కోకిల బాషాపై వేధింపులు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వం మారినప్పటి నుంచి ఆయన వాటాకు సంబంధించిన డబ్బులు రావడం లేదు. ఇబ్బందులు పెడుతున్నారు. పొమ్మనలేక పొగ పెట్టారు. ఎలాగైనా తప్పించాలన్న ప్రయత్నాలు ముమ్మరం చేశారని తెలుస్తోంది. మాట విననందుకే తనపై లేనిపోని కేసులు నమోదు చేయడం, తాలుకా పోలీసు స్టేషన్, వన్ టౌన్ పోలీసు స్టేషన్ ఇలా.. ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు సమాచారం.



## గుర్తు తెలియని మృతదేహం లభ్యం



**కర్నూలు(రూరల్):** నగర శివారులోని మునగాలపాడు సమ్మర్‌స్టోరేజ్ ట్యాంక్‌లో 30 ఏళ్ల వయస్సున్న ఓ మహిళ మృతదేహం లభ్యమైంది. కర్నూలు అర్బన్ పోలీసులు తెలిపిన వివరాలు.. సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లో మృతదేహం ఉన్నట్లు మంగళవారం స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పోలుసులు ఘటనా స్థలానికి చేరుకుని బయటకు తీశారు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వస్పత్రికి తరలించారు. మహిళ ఆచూకీ తెలిసిన వారు 9121101063 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసులు తెలిపారు.



## రోడ్డుప్రమాదంలో రైతుకు తీవ్ర గాయాలు

**రుద్రవరం:** రుద్రవరం–అప్పనపల్లె దారిలో ట్రాక్టర్ బోల్తా పడటంతో ఓ రైతు తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. మండలంలోని కొండమాయపల్లెకు చెందిన రైతు జమాల్ మంగళవారం సాయంత్రం అప్పనపల్లె దారిలో ఉన్న తన పొలంలో సేద్యపు పనులు ముగించుకుని ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడటంతో జమాల్ తీవ్రంగా గాయపడ్డాడు. అటుగా వెళ్తున్నవారు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకుని క్షతగాత్రుడిని రుద్రవరంలోని ఓ వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స అనంతరం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు.

### ‘కిక్కు’ దిగేలా జరిమానా

**కర్నూలు:** మద్యం సేవించి వాహనాలు నడుపుతూ డ్రంకన్ డ్రైవ్‌లో తనిఖీల్లో పట్టుబడిన 21 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ ఫస్ట్‌క్లాస్ జ్యుడీషియల్ ఇన్‌చార్జ్ మెజిస్ట్రేట్ తీర్పు చెప్పారు. ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి సి.క్యాంప్ సెంటర్, విశాల్ మార్ట్ వద్ద డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. పలువురు మోతాదుకు మించి మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడగా వారిని మంగళవారం ఉదయం కోర్టులో హాజరుపరిచారు. మెజిస్ట్రేట్ తీర్పు మేరకు వారి నుంచి రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.2.10 లక్షలు జరిమానా వసూలు చేశారు. భవిష్యత్తులో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడితే జరిమానాతో పాటు జైలు శిక్ష కూడా తప్పదని హెచ్చరించారు.

### వివాహిత ఆత్మహత్య

**అవుకు:** మండల పరిధిలోని రామవరం గ్రామంలో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. రామవరం గ్రామానికి చెందిన సుద్దల శిరీష(26), సుద్దల వెంకటేశ్వర్లు భార్యాభర్తలు. భర్త మద్యానికి బానిస కావడంతో గ్రామంలో అందరూ చిన్న చూపు చూస్తున్నారని బాధపడేది. ఎన్ని సార్లు చెప్పినా భర్త తాగుడు మానుకోకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై మంగళవారం ఎవరూలేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి రామేశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజారెడ్డి తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు.

## వక్ఫ్ చట్ట సవరణను ఉపసంహరించుకోండి




నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

**కర్నూలు(సెంట్రల్):** వక్ఫ్ చట్ట సవరణను ఉపసంహరించుకోకుంటే ముస్లిం మహిళలే ముందుండి ఉద్యమాన్ని నడిపేందుకు సిద్ధంగా ఉన్నారని ముస్లిం పర్సనల్ లాబోర్డు రాష్ట్ర కమిటీ సభ్యులు జలీసా సుల్తానాయాసీన్, అఖిల భారత ప్రజాతంత్రమహిళా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.నిర్మల, జమాతే ఇస్లామియా ఏ హింద్ సభ్యులు కుద్దుసా, నాసిర ఖానం కేంద్రప్రభుత్వాన్ని హెచ్చరించారు. మంగళవారం నగరంలోని మెరిడియన్ ఫంక్షన్ హాలులో సేవ్ వక్ఫ్..సేవ్ రాజ్యాంగం జేఏసీ ఆధ్వర్యంలో వక్ఫ్ చట్ట సవరణను వ్యతిరేకిస్తూ తాహెరున్నీ, పర్వీల అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్రం ప్రభుత్వం వక్ఫ్ భూములను బడా బాబులకు కట్టబెట్టేందుకే చట్ట సరవణ చేసిందని విమర్శించారు. ఎంపీల సంఖ్యా బలం ఉందని ముస్లింల ఆత్మగౌరవాన్ని కించ పరిచేలా వక్ఫ్ చట్ట సవరణ చేయడం తగదన్నారు. ముస్లింల ఆస్తులను కాజేసేందుకు ఆర్ఎస్ఎస్ కుట్రలో బీజేపీ పాలు పంచుకుందన్నారు. తమ వక్ఫ్ ఆస్తుల్లో ముస్లింమేతరుల పెత్తనం ఎందుకని ప్రశ్నించారు. నతరం మెరిడియన్ ఫంక్షన్ హాలు నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి గాంధీ విగ్రహం ఎదుట కాసేపు నిరసన చేపట్టి కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి అలివేలు, నాయకురాళ్లు అరుణ, జయమ్మ, పుష్పావతి, పద్మావతి పాల్గొన్నారు.